సాక్షి తిరుపతి

గురువారం । 4 । జనవరి । 2024



టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు

టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు అందించేందుకు కృషి చేస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - 8లో



30 ఏళ్ల నిరీక్షణకు తెర

టీటీడీ కళాశాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. - 8లో



లారీని ఢీకొన్న ఐషర్

వెంకటగిరి సమీపంలో ఆగి ఉన్న లారీని ఓ ఐషర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,712 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,902 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.97 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పారదర్శకంగా ఓటరు తుది జాబితా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

అమ్మవారికి ముత్యాల చీర.. ఆభరణాల వితరణ



ఆలయ కమిటీ చైర్మన్‌కు ముత్యాల చీర అందిస్తున్న దాత బంధువులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన రవి, గాయత్రి దంపతులు తమ కుమార్తె పేరు మీద రూ.25లక్షల విలువైన ముత్యాల చీర, కిరీటం, కవచం, వడ్డాణం, హస్తం, పాదాలను వితరణగా అందించారు. దాతల బంధువులు ఆయా వస్తువులను ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ దాత రవి గతంలో స్వామి,అమ్మవార్ల దర్శనానికి వచ్చినప్పుడు ముత్యాలు పొదిగిన చీర, కవచం కావాలని కోరగా వెంటనే స్పందించి హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు చీర, ఆభరణాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రస్తు తం దాత, కుటుంబీకులు అమెరికాలో ఉన్నారని, సంక్రాంతి అనంతరం వస్తారన్నారు. అప్పు డు వారి చేతులమీదుగానే అమ్మవారికి ఆభరణాలు, చీర అందజేయనున్నట్లు వెల్లడించారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అర్హులైన జర్నలిస్ట్‌లందరికీ అక్రిడిటేషన్ పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధుల అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అక్రిడిటేషన్ మంజూరు కాని వారు నిబంధనల మేరకు సంబంధిత పత్రాలను ఆన్‌లైన్ సమర్పించాలని సూచించారు. ఈ మేరకు నిర్వహించే కమిటీ సమావేశంలో ఆయా దరఖాస్తులను పరిశీలించి అక్రిడిటేషన్ మంజూరు చేస్తామన్నారు. పలు మీడియా యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు మార్పులు చేర్పులకు ఆమోదం తెలిపామన్నారు. ఈ క్రమంలో మీడియా ప్రతినిధుల జాబితాను ఆర్టీసీ వారికి పంపుతున్నట్లు వెల్లడించారు. జర్నలిస్ట్‌లకు వెంటనే బస్‌పాస్‌లు మంజూరు చేయాలని ఆదేశించినట్లు వివరించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ బాలకొండయ్య, సభ్యులు రవిరెడ్డి(సాక్షి), ప్రదీప్‌కుమార్, మునికృష్ణయ్య, కార్తీక్ , లావణ్యకుమార్, , అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్‌మెంట్ కృష్ణారెడ్డి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శివకుమార్, రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఆర్టీసీ ఏటీఎం డీఆర్ నాయుడు, డీపీఆర్ఓ విజయసింహారెడ్డి, డివిజనల్ పీఆర్ఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



తిరుపతిలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన



భాకరాపేటలో పింఛన్ అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, తుడా చైర్మన్

ఆనందం పెంచేన్

అవ్వాతాతల్లో ఆనందం ఉప్పొంగింది.. వితంతువుల ముఖాల్లో చిరునవ్వు కదలాడింది.. దివ్యాంగులకు మరింత భరోసా వచ్చింది.. ఒంటరి మహిళల బతుకుదెరువుకు ధీమా ఏర్పడింది.. ఇచ్చిన మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కృతజ్ఞతా భావం వెల్లివిరిసింది. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3వేలకు పెంచడంపై సర్వత్రా హర్షామోదం వ్యక్తమవుతోంది.. బుధవారం ఈ మేరకు పండుగ వాతావరణంలో సామాజిక పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికార యంత్రాంగం పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేస్తోంది.

- రూ.3వేలకు పెరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక
- ప్రతి నెలా 2,74,894 మందికి రూ.81.93 కోట్లు
- వేకువ నుంచే పంపిణీ చేస్తున్న వలంటీర్లు

భాకరాపేట / తిరుపతి అర్బన్: కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అందులో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3వేలకు పెంచారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లులోని జగనన్న సమావేశ మందిరంలో జిల్లా స్థాయి పింఛన్ల పండుగ నిర్వహించారు. తొలుత వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగం వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ముందుగా చెప్పినట్లుగానే విడతల వారీగా పింఛన్ మొత్తం పెంచుకుంటూ వెళ్లినట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పింఛన్ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల నుంచి 2,74, 894 మందికి రూ.81.63 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్తగా 2,977 మంది లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అవ్వాతాతలకు అండగా ముఖ్యమంత్రి జగనన్న ఎల్లప్పుడూ ఉంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రజలకు ఇప్పుడు ఆ కష్టాలు తప్పాయన్నారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక పోస్టర్ ఆవిష్కరించారు. లబ్ధిదారులకు మెగా చెక్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, ఎంపీడీఓ దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని జీవకోన వద్ద పింఛన్ల పంపిణీలో టీటీడీ బోర్డు చైర్మన్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కార్పొరేటర్లు సంధ్య, ,కోటేశ్వరమ్మ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పిచ్చాటూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



వెంకటగిరిలో పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి



గూడూరులో వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న పొనకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు

కొండంత భరోసా



ఇటీవలే నా భర్త చనిపోయాడు. ఇద్దరు పిల్లల బాధ్యత నా పైనే పడింది. ఇలాంటి సమయంలో రూ.3వేల పింఛన్ మా కుటుంబానికి కొండంత భరోసాగా నిలుస్తుంది. జగనన్నతోనే ఇంత మొత్తం అందుతోంది. ఆయన సహాయాన్ని మేము ఎప్పుడూ మరిచిపోం. తొలిసారి పింఛన్ అందుకోవడం సంతోషంగా ఉంది.

– జి.జ్యోతి, సత్యనారాయణపురం, తిరుపతి

రుణపడి ఉంటా



నాలాంటి ముసలోళ్లని సొంతవాళ్లే పట్టించుకోని ఈ కాలంలో జగన్ నా మన వడిలా అండగా నిలిచాడు. ప్రతి నెలా పింఛన్ సొమ్ముతో ఆదుకుంటున్నాడు. ఇప్పుడు రూ. 3 వేలు అందిస్తుండడం ఆనందంగా ఉంది. ఈ డబ్బులతో నాక్కావాల్సింది కొనుక్కొని తింటా. ఎవరినీ అడుక్కోవాల్సిన పరిస్థితి ఉండదు. మంచి మనసున్న జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటా.

– వసంతమ్మ, రామాపురం, పిచ్చాటూరు మండలం

ఆదుకుంటున్నాడు



నాకు ప్రతి నెలా పింఛను ఇచ్చి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేవుడిలా ఆదుకుంటున్నాడు. ఈ వయసులో నేను కూలీ పనులకు కూడా వెళ్లలేను. దీంతో కుటుంబానికి భారంగా ఉండాల్సి వచ్చేది. పింఛన్ రావడం వల్లే నా ఇంట్లో కూడా నన్ను బాగా చూసుకుంటున్నారు. ఇప్పుడు రూ.3వేలకు పింఛన్ పెంచడం ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పి.నాగయ్య, రామగిరి, పిచ్చాటూరు మండలం

ఎంతో ఆసరా



ప్రభుత్వం పింఛన్‌ను రూ.3వేలు చేయడం సంతోషంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో పలుమార్లు తిప్పి తిప్పి పింఛన్ ఇచ్చేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటికే పింఛన్ సొమ్ము పంపిస్తున్నారు. ప్రతి నెలా ఠంచన్‌గా ఒకటో తేదీనే నగదు వస్తుండడం ఎంతో ఆసరాగా ఉంది. మాట ఇస్తే నెరవేరుస్తానని జగనన్న మళ్లీ నిరూపించుకున్నారు.

– మేకల బుజ్జమ్మ, మానమాల, ఓజిలి మండలం

జగనన్నే రావాలి



రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే రావాలి. ఆయన వస్తేనే మాలాంటి వాళ్లు ధీమాగా జీవించగలం. 2019 వరకు ఎన్నిసార్లు తిరిగినా నాకు పింఛన్ మంజూరు చేయలేదు. ధర్నా చేసినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న సీఎం అయిన నెలలోనే పింఛన్ మంజూరు చేశారు. ప్రతి నెలా వలంటీర్ మా ఇంటికి వచ్చి నిద్రలేపి మరీ పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. అందుకే జగనన్నను గెలిపించుకుంటే పది మంది బతుకుతారు.

– ఖాదర్‌వలీ, దివ్యాంగుడు, చిన్నగొట్టిగల్లు

మేలు మరువలేం



నా పెద్ద బిడ్డ జగన్ బాబు చేసిన మేలును ఎన్నటికీ మరువలేం. ఈ ప్రభుత్వం వచ్చాక రూ. 2 వేలు నుంచి పింఛన్ రూ.3వేలకు పెరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా పింఛను పెంచి మా జీవితాల్లో ఆనందం నింపారు. పేదలకు కష్టం వస్తే ఆదుకునేందుకు తాను ఉన్నాననే భరోసా కల్పించారు.

– ఎం.పద్మావతి, జర్నలిస్ట్ కాలనీ, తిరుపతి

సంతోషంగా ఉంది



నాకు వితంతు పింఛను కింద తొలిసారే రూ.3 వేలు తీసుకోవడం సంతోషంగా ఉంది. నా భర్త చనిపోయిన తర్వాత కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నా. ప్రతి నెలా మందులు కొనుక్కునేందుకు నానా అవస్థలు పడేదాన్ని. ఇప్పుడు పింఛన్ సొమ్ముతో కావాల్సిన మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు వచ్చింది. మాలాంటి పేదలకు సాయం చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– శాంతి, ఓబుల్ రాజు కండ్రిగ, పిచ్చాటూరు మండలం

ఇంకేం కావాలి



జగన్‌బాబు మమ్మల్ని చక్కగా పోషిస్తున్నారు. ఇప్పుడు రూ.3వేల పింఛన్ అందుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. తెల్లారకముందే వలంటీరు నేరుగా ఇంటికి వచ్చి తలుపు తట్టి లేపి పింఛను డబ్బులు ఇస్తున్నాడు. ఇంతకన్నా మా లాంటి వృద్ధులకు ఇంకేం కావాలి. గతంలో అయితే పంచాయతీ కార్యాలయానికి ఉదయం వెళ్లి కూర్చుంటే ఎప్పుడో సాయంత్రానికి ఇంటికి చేరే వాళ్లం. ఒకొక్క సారి వేలి ముద్రలు పడలేదని ఉట్టి చేతులతో పంపేసేవాళ్లు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేవు.

– ఎం.చెంగమ్మ, వెదుర్లచెరువు ఎస్టీ కాలనీ, రేణిగుంట మండలం

జగనన్నతోనే అభివృద్ధి..సంక్షేమం

చంద్రగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధి సాధ్యమని ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు తెలిపారు. వై నాట్ 175 పిలుపునకు మద్దతుగా ఆయన చేపట్టిన ఇడుపులపాయ టూ ఇచ్ఛాపురం పాదయాత్ర బుధవారం చంద్రగిరికి చేరింది. వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు ఘనంగా స్వాగతం పలికి పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ ఆయనను సత్కరించారు.. బసవరావు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కరోనా సమయంలో ముఖ్యమంత్రి జగనన్న ప్రజలకు భరోసా కల్పించారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య సదుపాయాలను కల్పించి ప్రాణదాతగా నిలిచారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ నవరత్న పథకాలతో వారి జీవితాల్లో వెలుగులు నింపారని వెల్లడించారు. నాలుగున్నర ఏళ్లలో ఇంతగా మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. మొత్తం 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకోవడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాయకులు ముదికుప్పం రామ్మూర్తి, అజయ్, మణి, బుల్లెట్ భాను, బాలాజీ పాల్గొన్నారు.



బసవరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కదలిన జగన్ దండు

చంద్రగిరి : తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో యువతలో ఉత్సాహం ఉప్పొంగింది. బుధవారం చంద్రగిరిలో భారీ ర్యాలీ చేపట్టింది. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో సుమారు 500 బైక్‌లతో యువకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరై ర్యాలీ ప్రారంభించారు. చంద్రగిరి నాగాలమ్మ కూడలి నుంచి పాతపేట, కొత్తపేట, దాసరవీధి వరకు ప్రదర్శన కొనసాగింది. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప దార్శనికుడని కొనియాడారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తున్నారన్నారు. అందులో భాగంగానే మోహిత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. జగనన్న సైనికుడిగా, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్ఫూర్తితో చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు వచ్చారని వెల్లడించారు. నాలుగున్నరేళ్ల సేవను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరు యుగంధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి, మాధవరెడ్డి, విరుపాక్షి ప్రసాద్, ముద్దికుప్పం రామ్మూర్తి, బండారు హేమచంద్ర, మదన్, ప్రవీణ్, మట్టిరెడ్డి నవీన్, అంగేరి రాజశేఖర్, తానాటి చంద్ర, బుజ్జిబాబు, పుల్లూరు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

రేపే వెంకటగిరి నుంచి 'యాత్ర'

- రాపూరులో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న వైఎస్సార్‌సీపీ ప్రముఖ నేతలు
- విజయవంతం చేయాలని నేదురుమల్లి పిలుపు

సైదాపురం(వెంకటగిరి) : వెంకటగిరి నుంచి రాపూరు వరకు శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముందుగా నేదురుమల్లి బంగ్లా వద్ద మహానేతలకు నివాళులర్పించి ఉదయం 10.30 గంటలకు యాత్రను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాంపాళెం, డక్కిలి మీదుగా రాపూరుకు ర్యాలీ చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి నారాయణస్వామి, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ చక్రవర్తి, మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, సినీ నటుడు అలీ, నాగార్జునయాదవ్, పోతులసునీత, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు గెలిపిస్తారని స్పష్టం చేశారు. వైనాట్ 175 నినాదం నూటికి నూరుపాళ్లు నిజమవుతుందని స్పష్టం చేశారు. ఎన్‌డీసీసీ బ్యాంకు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, విప్ లక్ష్మి, వైస్ చైర్మన్ బాలయ్య, సహాయకార్యదర్శి హరికృష్ణ, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు వహిదా, కల్యాణి, బాడా జానకిరామయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్, వక్ఫ్ బోర్డు సభ్యుడు ఫఠాన్ తాజుద్దీన్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

చీకటి రాజకీయాలు చెల్లవు

రాపూరు: చీకటి రాజకీయాలు ఇకపై చెల్లవని, దమ్ముంటే ధైర్యంగా ముందుకు వచ్చి పాలిటిక్స్ చేయాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. స్థానిక తెలుగు గంగ అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను కొందరు ప్రలోభపెట్టేందుకు యత్నిస్తున్నారని, వారి మాయంలో ఎవరూ పడరని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బస్సు యాత్ర రాపూరుకు చేరుకుంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ మొదలవుతుందని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు రవికుమార్, నెల్లూరు రవీంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లీలామోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతిగా మద్యం తాగి వృద్ధుడి మృతి


చొక్కలింగం మృతదేహం

పాకాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు సమీపంలో నివసించే చొక్కలింగం(60) అనే వృద్ధుడు అతిగా మద్యం తాగి బుధవారం మృతి చెందాడు. వివరాలు.. చొక్కలింగం ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి బజారు వీధిలోని ఆర్యవైశ్య కల్యాణమండపం వద్ద మద్యం తాగాడు. దాంతోపాటు శానిటైజర్ కూడా తాగి ఉంటాడని, అందుకే మరణించాడని కుటుంబీకులు చెబుతున్నారు. ఇంటికి ఆసరాగా ఉన్న వ్యక్తి హఠాత్తుగా మృతి చెందడంతో ఏమి చేయాలో తెలియడం లేదని చొక్కలింగం భార్య కన్నీరుమున్నీరవుతోంది.

రాజులకండ్రిగలో చోరీ

నాగలాపురం : మండలంలోని రాజుల కండ్రిగ గ్రామంలో రాజేంద్రరాజు అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. రాజేంద్రరాజు దంపతులు తమ కుమారుడు అనిల్‌తో కలిసి తమిళనాడులోని తిరువళ్లూరుకు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చే సరికి తలుపులు, బీరువా పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 56 సవర్ల బంగారు నగలు, రూ.7లక్షల నగదు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి వద్ద అమర్చిన సీసీ కెమెరాలో దుండగుల వచ్చిన దృశ్యాలు నమోదైనట్లు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు.

30 ఏళ్ల నిరీక్షణకు తెర

- టీటీడీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్
- ఫిబ్రవరి తొలివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు


శ్రీపద్మావతి మహిళా కళాశాల

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాలల్లో అధ్యాపక పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. డిగ్రీ కళాశాలలో 49 పోస్టులు, జూనియర్ కాలేజీలో 29 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై 30 ఏళ్లుగా టీటీడీ కళాశాలల్లో లెక్చరర్ శాశ్వత పోస్టుల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూమన బాధ్యతలు చేపట్టాకే..

టీటీడీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత టీటీడీ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు సంకల్పించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయించారు.

బాబు పాలనలో నిరాశే..

గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు టీటీడీలో శాశ్వత ఉద్యోగాలకు చరమగీతం పాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో తాత్కాలిక ఉద్యోగులతో కాలం వెళ్లబుచ్చారు. నిరుద్యోగులకు నిరాశనే మిగిల్చారు. విద్యా సంస్థలను రాజకీయ వేదికలుగా మార్చేశారు. చివరకు విద్యావ్యవస్థనే నిర్వీర్యం చేసేశారు. తమ స్వార్థ రాజకీయాలకు విద్యార్థులు, నిరుద్యోగులను బలి చేశారు.

ఫిబ్రవరిలో దరఖాస్తులు

టీటీడీ విద్యాసంస్థల్లో అధ్యాపక పోస్టులకు వచ్చేనెల ఫిబ్రవరి మొదటి వారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ క్రమంలోనే ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంచుతున్నారు.

నాణ్యమైన విద్య

కొన్నేళ్లుగా టీటీడీ విద్యా సంస్థల్లో అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ రాలేదు. టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి ప్రత్యేక చొరవతో శాశ్వత ప్రాతిపదికన డీఎల్, జేఎల్ ఉద్యోగాలు భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం. ఇది నిరుద్యోగ యువతకు శుభవార్త. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం.
– ఎం.భాస్కర్‌రెడ్డి, డీఈఓ, టీటీడీ, తిరుపతి

ఊహించలేదు

టీటీడీ విద్యాసంస్థలలో శాశ్వత అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ విడుదలవుతుందని ఊహించలేదు. గత ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో అధ్యాపకులను నియమించాయి. శాశ్వత పోస్టుల భర్తీ జోలికే వెళ్లలేదు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతోనే సీఎం జగనన్న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డికి కృతజ్ఞతలు.
– రాజేశ్వరి, పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థి, చంద్రగిరి

సంతోషంగా ఉంది

ఇన్నేళ్లకు టీటీడీలో అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ రావడం సంతోషంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యారంగాన్ని చిన్నచూపు చూశారు. కుల రాజకీయాలతో విద్యార్థుల్లో విభజన తీసుకువచ్చారు. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. జగనన్న పాలనలో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోంది. ఇప్పుడు శాశ్వత ఉద్యోగాల భర్తీతో టీటీడీ కళాశాలల్లో చదువు మరింత చక్కగా ఉంటుంది.
– ప్రకాశ్‌రెడ్డి, పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థి, తిరుపతి

రుణపడి ఉంటాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో టీటీడీ కళాశాల్లో అధ్యాపక పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయించారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న మాకు తీపి కబురు అందించారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఏపీపీఎస్సీ నిర్వహించనున్న పోటీ పరీక్షకు సన్నద్ధమవుతున్నాం.
– రాజశేఖర్, పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థి, తిరుపతి

టీటీడీ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు


టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న హౌసింగ్ సొసైటీ నాయకులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో ఇళ్ల స్థలాలు అందించే వరకు తాను నిరంతరం కృషి చేస్తానని.. ఇందులో ఎలాంటి అపోహలు అవసరం లేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం టీటీడీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు తిరుపతిలోని టీటీడీ చైర్మన్ ఇంటి వద్దకు వెళ్లి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికే 3,518 మంది ఉద్యోగులకు ఇంటి పట్టాలు అందించినందుకు కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న డిప్ కార్యక్రమంపై యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సహకారం అందిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ కార్యదర్శి గోల్కొండ వెంకటేశులు, ప్రసాద్‌రావు, కల్పన, ఇందిర, గుణశేఖర్, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐషర్

- డ్రైవర్ మృతి

సైదాపురం(వెంకటగిరి) : పట్టణం వద్ద ఏర్పేడు–పెంచలకోన జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బుధవారం వేకువజామున ఓ ఐషర్ లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం నుంచి జామాయిల్ దుంగల లోడ్‌తో తిరుపతి వెళుతున్న లారీ స్థానిక ఐటీఐ వద్ద డివైడర్‌ను ఢీకొని మరమ్మతులకు గురై ఆగిపోయింది. ఈ క్రమంలో వైఎస్సార్ జిల్లా మైదుకూరు నుంచి ఎర్రగడ్డలలో లోడ్‌లో వస్తున్న ఐషర్ లారీ వెనకనుంచి ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంవతో ఐషర్ డ్రైవర్ హరి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో లారీలను విడదీశారు. మృతదేహాన్ని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహారావు తెలిపారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన హరి మృతదేహం

చెరువు కట్ట కబ్జాకు యత్నం


చెరువు కట్టను చదును చేస్తున్న జేసీబీ

ఏర్పేడు : మండలంలోని వికృతమాల చెరువు కట్టను కబ్జా చేసేందుకు బుధవారం ఓ రియల్టర్ యత్నించినట్లు గ్రామస్తులు ఆరోపించారు. వివరాలు.. తిరుపతికి చెందిన ఓ రియల్టర్ చెరువు కట్ట పక్కన వెంచర్ కోసం భూమి చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అండతో చెరువు కట్టను జేసీబీతో 500 మీటర్ల మేర చదును చేసి తన వెంచర్‌లో కలుపుకునేందుకు ప్రయత్నించాడు. గుర్తించిన స్థానికులు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కిషోర్‌రెడ్డి సూచనల మేరకు గ్రామస్తులు వెంటనే జేసీబీని అడ్డుకుని పనులను ఆపారు. మళ్లీ జేసీబీతో చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టారు.

సంపులో పడి యువకుడి మృతి

తిరుపతి క్రైమ్ : నగరంలోని ఆటోనగర్‌కు చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో బుధవారం సంపులో పడి మృతి చెందాడు. అలిపిరి ఎస్‌ఐ ఇమ్రాన్ బాషా కథనం మేరకు.. కాకినాడ సమీపంలోని పెద్దాపురానికి చెందిన సత్యనారాయణ(25) చైతన్యపురంలో నివాసం ఉంటున్నాడు. స్థానిక అంకాలమ్మ గుడి సమీపంలో అతిగా మద్యం తాగి ఓ సంపులో పడిపోయి ఊపిరి అందక మరణించాడు. మృతుడి అన్న దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

శక్తిఅమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి


శక్తి అమ్మకు తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

వేలూరు: వేలూరు శ్రీపురంలోని బంగారు గుడి, శ్రీనారాయణి పీఠం పీఠాధిపతి శక్తి అమ్మ 48వ జన్మదినోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సతీసమేతంగా హాజరయ్యారు. ఈసందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదాలను స్వామివారికి ఆయన అందించి ఆశీస్సులు పొందారు. అనంతరం అభిషేకం, మంగళ హారతి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.

శిల్ప కళాశాల కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

తిరుపతి(అలిపిరి): శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను సాయంత్రం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది శిక్షణ కలిగిన సర్టిఫికెట్ కోర్సులైన సంప్రదాయ కలంకారీ కళ, శిల్పకళలలో ప్రాథమిక అంశాలు కోర్సులను నూతనంగా ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. కళాశాలలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రంలోపు సమర్పించాలని తెలిపారు. ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని.. గరిష్ట వయో పరిమితి లేదని పేర్కొన్నారు. వివరాలకు అలిపిరి రోడ్డులోని ఎస్వీ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ లేదా 0877–2264637, 9866997290 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పీజీ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి సిటీ : తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఎంఏ హిందీ, ఎంఏ శబ్ద బోధన, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ యోగా థెరపీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు www.nsktu.ac.in వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పూజారి కన్నుమూత


చంద్రశేఖర్ మృతదేహం

తడ: చెన్నై– నెల్లూరు జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని పంట్రంగం ఆలయ పూజారి గోవర్ధనగిరి చంద్రశేఖర్(75) మృతి చెందారు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. చంద్రశేఖర్ బుధవారం కొండూరు పంచాయతీ, పులివేంద్ర గ్రామానికి వచ్చి రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మృతదేహం వద్ద లభించిన ఫోన్ నంబరు ఆధారంగా కడపలో పూజారిగా పనిచేస్తున్న ఆయన కుమారుడికి సమాచారం అందించంఆరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం


బోల్తా పడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్) పార్థసారథి (ఫైల్)

కలువాయి: మండలంలోని చింతలపాళెం సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కొల్లా పార్థసారథి నాయుడు తన పొలంలో పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ట్రాక్టర్ కింద చిక్కుకున్న పార్థసారథి అక్కడికక్కడే మరణించాడు. గ్రామస్తులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.